## క్లుప్తంగా

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**చర్ల:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మందికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదివారం కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 20 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పేద కుటుంబాల్లో మహిళల వివాహాలకు ఆర్థికంగా నిలిచేందుకు ప్రభుత్వం అందజేస్తున్న ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కల్యాణలక్ష్మి లబ్ధిదారులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించండి

**భద్రాచలంటౌన్:** భద్రాచల పట్టణ బీసీ ఐక్య వేదిక నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌ను ఆదివారం క్యాంప్ కార్యాలయంలో కలిసి బీసీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించిదని, ఆ ప్రకారం త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రతిపాదికన రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఉద్యోగ ఉపాధి రంగాల్లో ప్రాధాన్యత కల్పించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. బోలిశెట్టి రంగారావు, రవికుమార్, రామాచారి, నాగేశ్వరరావు, నరసింహాచారి, మల్లుబాబు, శాంతరావు, ఆదినారాయణ, రామచంద్రయ్య, హనుమంతరావు, నరసింహారావు, రాంప్రసాద్, శ్రీనివాసరావు, వెంకటరమణ, రమణయ్య, దత్తాత్రేయ, సీతారాం, గణేష్ పాల్గొన్నారు.

### జీఎంకు టీబీజీకేఎస్ శుభాకాంక్షలు

**మణుగూరుటౌన్:** ఏరియాలోని జీఎం కార్యాలయంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి ఆధ్వర్యంలో సెంట్రల్, కమిటీ నాయకులు జీఎం దుర్గం రాంచందర్‌కు ఆదివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్‌ను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్, బంగారి పవన్‌కుమార్, మస్తాన్, మురళీకృష్ణ, ఇమ్రాన్, నరేశ్, వినయ్‌కుమార్, శంకరయ్య, రమేశ్ బాబు, రమేశ్, సుధాకర్ యాదవ్, వినోద్, వినయ్, ముకేశ్, శ్రీనివాస్, రేవన్ తదితరులు పాల్గొన్నారు.

### ఏకతాటిపైకి రావాలి

**గుండాల:** ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలంతా ఏకతాటిపై ఉద్యమాలకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు మెంతెన వసంతరావు, జిల్లా నాయకులు మెంతెన ప్రభాకర్‌లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో చేపట్టబోయే లక్షడప్పులు, వేయి గొంతుల కళాజాతరను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బొమ్మెర్ల నాగేశ్వరరావు, కొండ్రు లక్ష్మీనారాయణ, కన్నయ్య, లాలయ్య, నవీన్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

### రగ్గులు, బ్యాగుల పంపిణీ

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని దబ్బతోగు కాలనీ గ్రామానికి చెందిన 140 కుటుంబాలకు బియాన్ డోనర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా రగ్గులు, విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఉచితంగా పంపిణీ చేసిన వాటి విలువ రూ.50వేల ఉంటాయని, సంస్థ బాధ్యులు తెలిపారు. పాస్టర్ బేతాళ ఆనంద్, సంస్థ బాధ్యులు మణి, శివ, వెంకటరమణ, మణికంఠ, దుర్గాప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించాలి

**మణుగూరుటౌన్:** మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న ఓబీ కంపెనీల తీరు మార్చుకుని నిబంధనలు పాటించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఓసీ–4 దుర్గా కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడికి నాలుగు రోజుల క్రితం ప్రమాదం జరిగి రెండు కాళ్లు విరిగినట్లు సమాచారం ఉందన్నారు. నిబంధనల ప్రకారం అధికారులకు, సూపర్‌వైజర్లకు సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా గుర్తింపు సంఘానికి సమాచారం ఇవ్వకుండా ప్రమాదబారిన పడిన కార్మికుడిని దొంగచాటుగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. యాజమాన్యం బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఒకే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీ వాసుల ఓట్లు 161, 162 బూతులలో ఉండటం వల్ల ఓటర్లు ఇబ్బంది పడుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఈ రెండు వార్డులో ఉన్న ఓటర్లు ఒకే చోట ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని దళిత ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లాడి జయరాజు కోరారు. పట్టణంలో ఆదివారం జరిగిన దళిత ప్రజా సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం అయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో రాజు, కృష్ణ, ఉదయ్, కిరణ్, శీను, శాంతి, ఏసు, సామేలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణం.. నరకప్రాయం!

- పూర్తికాని లింగాల–పస్రా రోడ్డు
- కంకరరోడ్డుపై ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


అదుపుతప్పి బోల్తాపడిన కారు (ఫైల్)


అసంపూర్తిగా ఉన్న పస్రా–లింగాల రోడ్డు, లారీ వెళ్తుండగా లేస్తున్న దుమ్ము

**గుండాల:** నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నామని ప్రభుత్వాలు పేర్కొంటున్నప్పటికీ ఏజెన్సీలో రహదారుల పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. దీనికి ప్రత్యేక నిదర్శనమే పస్రా–లింగాల ప్రధాన రహదారి దుస్థితి. పూర్తి స్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో 6 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులకు గ్రహణం పట్టింది. దీంతో నిత్యం గుండాల మీదుగా వరంగల్, మేడారం వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**నిలిచిపోయిన నిర్మాణ పనులు**

పస్రా–లింగాల ప్రధాన రహదారికి మెటల్ పోసి వదిలేశారు. దీంతో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. అంతేకాకుండా దుమ్ము, ధూళితో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కాగా, ములుగు జిల్లా(భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు) పస్రా–లింగాల 27 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు వేయడానికి రూ.20 కోట్లు మంజూరు అయ్యాయి. కానీ చాలా కాలం అటవీశాఖ అనుమతి లేక పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత పనులు ప్రారంభించగా 22 కిలోమీటర్ల వరకు బీటీ పనులు పూర్తి చేశారు. అయితే నిధులు విడుదల కావాల్సి ఉందని 5 కిలోమీటర్ల వరకు మెటల్ వేసి పనులను నిలిపివేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**వందల సంఖ్యలో ప్రయాణం..**

గుండాల, ఆళ్లపల్లి మండలాల ప్రజలు నిత్యం వరంగల్, హైదరాబాద్‌కు ప్రయాణం కొనసాగిస్తుంటారు. అటువైపుగా ఆర్టీసీ బస్సులు సైతం నడుస్తున్నాయి. ముఖ్యంగా మేడారం సమ్మక్క–సారక్క జాతరకు గుండాల, పస్రా మీదుగానే ప్రయాణం సాగుతుంది. ఫిబ్రవరిలో మినీ మేడారం జాతర ఉండడంతో ముందస్తుగానే మొక్కులు తీర్చుకునేందుకు భక్తుల రద్దీ పెరిగింది. దీంతో గుండాల నుంచే వెళ్లేందుకు మొగ్గుచూపుతున్నారు. జాతర సమయంలో ఖమ్మం, ఇల్లందు ఆర్టీసీ డిపో బస్సులను సైతం నడిపిస్తున్నారు. వీరితోపాటు వివిధ అవసరాల నిమిత్తం వరంగల్, మేడారం వెళ్లే ప్రయాణికులు ఈ రోడ్డుపై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెటల్ వేసి వదిలేయడంతో దుమ్ము, దూళితో వాహనదారులు అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

**నిత్యం ప్రమాదాలు**

ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల రెండు రోజులకోసారి ఏదో ఒక చోట వాహనాలు అదుపుతప్పి బోల్తాపడుతున్నాయి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, వరి పంటలను ములుగు, వరంగల్‌లో అమ్ముకునేందుకు రైతులు వెళ్తున్నారు. మరో రెండు నెలల్లో మేడారం జాతర ప్రారంభం కానుంది. ఇటీవల కురిసిన వర్షాలకు మెటల్ రోడ్డు అక్కడక్కడ దెబ్బతిని అధ్వానంగా ఉంది. ఈ పరిస్థితుల్లో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. అధికారులు స్పందించి త్వరిగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

**త్వరలోనే పనులు ప్రారంభిస్తాం**

పనులు ప్రారంభించిన గుత్తెదారుడికి పేమెంట్ రావాల్సిన ఉండగా జాప్యం జరుగుతోంది. ఈ మధ్య కాలంలోనే పనులు ప్రారంభిస్తాం. మినీ మేడారం జాతర సమయానికి రోడ్డు పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– ఆర్అండ్‌బీ డీఈ రఘువీరా, ములుగు జిల్లా

# పరశురామావతారంలో రామయ్య


పరశురామావతారంలో పర్ణశాల రామయ్య

**దుమ్ముగూడెం:** పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా 6వ రోజు ఆదివారం పర్ణశాల రామయ్యను పరశురామావతారంలో అలంకరించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించిన అర్చకులు.. అనంతరం స్వామి వారిని పరశురామావతారంలో అలంకరించారు. మహావిష్ణువు జమదగ్ని అనే మహర్షికి కుమారుడై అవతరించి పరశురాముడు (భార్గవరాముడు) అని పిలువబడుతూ.. దుష్టుడైన కార్తవీర్యార్జునుని దుర్మార్గులైన రాజులను ఇరవై ఒక్కమారు సంహరించాడు. ధర్మాన్ని స్థాపించాడు. ఈ నేపథ్యంలో ఈ అవతారాన్ని అలంకరించారు. శుక్రగ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శించడం వలన శుభ ఫలితాలను పొందుతారని అర్చకులు వివరించారు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రాయప్రోలు సుబ్రమ్మణ్యం, నాగభూషణం శర్మలు హరికథను ఆలపించారు. సాయంత్రం సంపూర్ణ కోలాటం బృందం తరుపున కోలాటం, వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ తిరువీధి సేవ నిర్వహించారు. నేడు స్వామివారం శ్రీరామావతారంలో దర్శనం ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భార్గవాచార్యులు, వేదపండితులు మల్లూరు రవికుమార్ శర్మ, నాలదీగల నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజచార్యులు, ఆలయ సిబ్బంది శివ,రాము తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క హామీనీ నెరవేర్చలేదు..

**మణుగూరుటౌన్:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలన ప్రారంభమై 13 నెలలు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కూనవరం పంచాయతీ పార్టీ జనరల్ బాడీ సమావేశం మడివీరన్న బాబు అధ్యక్షతన జరగ్గా.. ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఏ ఒక్క హామీని అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే స్థానిక ఎన్నికల్లో డిపాజిట్ రాకుండా గుణపాఠం చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పినపాక అభివృద్ధికి అనేక లక్షలాది నిధులు తెచ్చి అభివృద్ధి చేశారన్నారు. అనంతరం కూనవరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుని పార్టీ బలోపేతానికి శక్తివంచన కృషి చేయాలని సూచించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్‌కె మూస, మడివీరన్న బాబుతో పాటు ఇద్దరు ఉపాధ్యక్షులను, కోశాధికారి, సహాయ కార్యదర్శితో పాటు మరో 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అదేవిధంగా పగిడేరు గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, సీనియర్ నాయకులు వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, ఆవుల నర్సింహారావు, అక్కి నర్సింహారావు, టీబీజీకేఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్, కూనవరం మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, కలగూర శంకర్, ఉప్పుతల రామారావు, బర్ల సురేశ్ తదితరులు ఉన్నారు.

# మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

**ములకలపల్లి:** గ్రామపంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. జగన్నాథపురంలో గద్దల మహేశ్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సంఘ ములకలపల్లి మండల ప్రథమ మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్మికరంగ సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ అగ్రభాగాన నిలుస్తుందని అన్నారు. జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎండి.యూసఫ్, సంఘ మండల అధ్యక్షులు నారం సునిత, కార్యదర్శి ఎస్‌కె.జబ్బార్, నాయకులు నరాటి రమేశ్, బైటి అశోక్, కె.సంజీవ్. సంజీవరావు, సత్యనారాయణ, పొట్టి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా జెర్సీల బహూకరణ

**భద్రాచలంటౌన్:** రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్–2025 పాల్గొననున్న జిల్లా టీమ్‌కు గొటుల్, గోండ్వాన అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వతేజ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అక్కల శ్రీనివాస రాజు క్రీడా జెర్సీలను బహూకరించారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియమ్‌లో జరుగుతున్న 11వ తెలంగాణ స్టేట్ నేషనల్ మాస్టర్స్‌లో పాల్గొనే జిల్లా క్రీడాకారులకు ఈ జెర్సీలను ఆదివారం ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. సందర్భంగా గొటుల్ ఫౌండర్ మడివి నెహ్రూ మాట్లాడుతూ.. విశ్వతేజ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అక్కల శ్రీనివాస రాజుకి ధన్యదాలు తెలియజేశారు. కార్యక్రమంలో భూక్యా మంగిలాల్, కొర్సా నాగలక్ష్మి, కంగాల కృష్ణవేణి, భద్రయ్య, నాగిరెడ్డి, లక్ష్మయ్య, సీతారాములు, రాజు, దారయ్య, అనిల్, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు


క్రీడాకారులకు జెర్సీలను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

### 7న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

**అశ్వారావుపేటరూరల్:** వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు మండలంలోని వినాయకపురం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 7వ తేదీన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏడీఈ వెంకటరత్నం తెలిపారు. ఈ వేదిక ద్వారా అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కారిస్తారని, ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ (విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) చైర్మన్ ఎన్వీ వేణుగోపాల చారి అధ్యక్షతన నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**ములకలపల్లి:** మండలపరిధిలోని జగన్నాథపురానికి చెందిన ఇనుకుర్తి ప్రణీత్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక పోటీలకు ఎంపికయ్యాడు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యనభ్యసిస్తున్న ప్రణీత్ ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని, ప్రథమ స్థానంలో నిలిచాడు. చక్కటి సత్తా చాటిన ప్రణీత్.. మహబూబ్‌నగర్ జిల్లాలో రేపటి నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్రపోటీల్లో స్థానం దక్కించుకున్నాడు.

### గోటి తలంబ్రాల వడ్లకు పూజ

**భద్రాచలంటౌన్:** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో భక్తులు సమర్పించే కోటిగోటి తలంబ్రాల వడ్లకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం పట్టణంలోని లక్ష్మీ బాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో కోటిగోటి తలంబ్రాలు తయారు చేసే వడ్లకు రామయ్య సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వడ్లను భక్తి శ్రద్ధలతో గోటితో వలిసి రామయ్య కల్యాణంలో ముత్యాల తలంబ్రాలలో వినియోగిస్తారు. గత నాలుగేళ్లుగా రామయ్య కల్యాణంలో సుమారు క్వింటా వడ్లను గోటితో వలిసి సమర్పిస్తామని సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు.

### నేడు ఎమ్మెల్యే జారే పర్యటన

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో నేడు (సోమవారం) స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటిస్తారని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా మద్దికొండ, నారంవారిగూడెం కాలనీ, అల్లిగూడెం, అశ్వారావుపేట జీపీల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాల ప్రారంభోత్సవాలు చేస్తారని చెప్పారు. అదే విధంగా మద్దికొండ, మొద్దులగూడెం, కొత్త నారంవారిగూడెం గ్రామాల్లో సుమారు రూ.35లక్షల 80వేలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయనున్నారని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలకు సంబంధిత అధికారులు, సిబ్బంది హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

# క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి


బూర్గంపాడు: బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న ఎమ్మెల్యే పాయం

**బూర్గంపాడు:** యువత క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించాలని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సారపాకలోని సుందరయ్యనగర్ మైదానంలో సారపాక ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహిస్తోందని అన్నారు. గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తోందని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో ఇలాంటి టోర్నమెంట్‌లో నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు ఇంగువ రమేష్, రహీం, ప్రైజ్ మనీ దాతలు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కిషోర్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**అబ్బయ్య సేవలు మరువలేనివి..**

**అశ్వాపురం:** మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ దానూరి అబ్బయ్య సేవలు మరువలేనివని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ఆదివారం దానూరి అబ్బయ్య వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపం, చిత్రపటానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అశ్వాపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్ట్ యరమల కిషోర్‌రెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. మాజీ మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖదీర్ కుమార్తె వివాహంలో ఎమ్మెల్యే పాయం పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గద్దెల నిర్మాణాలకు భూమి పూజ..**

మండల కేంద్రంలో డీసీసీబీ బ్యాంక్ వెనుక స్థలంలో బంజారాల కులదైవమైన సంత్ సేవాలాల్‌మహారాజ్, మేరమ్మ భవాని గద్దెల నిర్మాణాలకు ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ చేశారు. సేవాలాల్ సేన ధర్మజాగరణ సాధువు ధరావత్ సక్రు, మండల అధ్యక్షుడు గుగులోత్ మోహన్‌నాయక్, కోటేశ్వరరావు, సోమ్లానాయక్, గుగులోత్ వీరస్వామి, భారజల కర్మాగారం ఏపీఓ పాడ్య కేశవరావు, హనుమనాయక్, ఇస్లావత్ నాగ, రామునాయక్, రాంబాబునాయక్, భూక్యా కిరణ్, సాయినాయక్ పాల్గొన్నారు.

# ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

**చర్ల:** మండల కేంద్రమైన చర్లతో పాటు అటవీ ప్రాంతాలకు వెళ్లే మార్గలలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చర్లలో జరిగే వారపు సంతకు సరిహద్దు ప్రాంతంలోని ఛత్తీస్‌గఢ్ నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు రానుండగా.. వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్సై నర్సిరెడ్డి తనిఖీలను కొనసాగించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు వచ్చి పోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకోగా విచారించి విడిచిపెట్టారు.

### ఆలయ కమిటీ చైర్మన్‌కు సన్మానం


ఐఎంఏ ఆధ్వర్యంలో దేవస్థానం చైర్మన్ సుదర్శన్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ నూతన పాలకమండలి చైర్మన్ డాక్టర్ సుదర్శన్‌రావు, జయభారతి దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. అదే విధంగా భద్రాచలం బీసీ సంఘం నాయకులు సుదర్శన్‌రావును కలిసి మార్యదపూర్వకంగా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భద్రాచలం ఐఎంఏ అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు జయభారతి, రవికుమార్, కోశాధికారి సురేష్, జాయింట్ సెక్రటరీ రమేష్‌చంద్ర, సభ్యులు నీలిమ, శ్రీక్రాంతి, రాజశేఖర్ రెడ్డి, అక్కినేని లోకోష్, సంతోష్, గీతాపావని పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

**దమ్మపేట:** మారుమూల ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలు అభినందనీయమని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిగ్ టీవీ ఛానల్ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలోని ఎల్‌వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని, ఎమ్మెల్యే జారే స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ లక్ష్మణ్ సాయి, ఎమ్మెల్యేకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరానికి వచ్చిన గ్రామస్తులకు, బీపీ, ఈసీజీ, పలు రకాల రక్త పరీక్షలను నిర్వహించారు. పరీక్షల ఫలితాలను పరిశీలించిన వైద్యులు, అనారోగ్య బాధితులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కక్కిరాల రమేష్, పర్వతనేని ప్రసాద్, అత్తులూరి వెంకటరామారావు, చిన్నశెట్టి యుగంధర్, సాయిల నర్సీ, గోపి, పగడాల రాంబాబు, రొయ్యల కుమార్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**దుమ్ముగూడెం:** మండలంలోని పెద్ద నల్లబెలి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహన మెకానిక్ పిల్ల నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతిచెందగా.. బాధిత కుటుంబానికి భద్రాచలం ద్విచక్ర వాహన మెకానిక్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.14,600 నగదును మృతుడి భార్యకు వితరణ చేశారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని వారు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సుందర్ రెడ్డి, శంకర్ సింగ్, చంద్రశేఖర్, అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల ప్రదీప్, వైస్ ప్రెసిడెంట్ ఆవుల రాజేష్, సెక్రెటరీ కుమార్, ట్రెజరర్ రామచంద్ర ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ వాళ్లే భాను, మధు, మల్లయ్య, మంగీలాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### సేవలు అభినందనీయం


చీరలు పంపిణీ చేస్తున్న ఎస్సై, సంస్థ బాధ్యులు

**ములకలపల్లి:** వికాస్ తరంగిణి స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఎస్సై కిన్నెర రాజశేఖర్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మొగరాలగుప్ప గ్రామస్తులకు దుప్పట్లు, చీరలు, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై.. డైరెక్టర్లు రమాదేవి, మృదుల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీరలతో వీటిని అందజేశారు. మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హెచ్ఎం స్వరూప భవాని, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి కొర్సా, రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ తాటి తులసి. నూతన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఈర్ల మోహన్‌రావు, కొప్పుల రాంబాబు, శనగపాటి రవి, సురభి రాజేశ్, గుంటూరు సాయి, మడకం శ్రీను, కీసరి వెంకటేశ్వర్లు, కొర్సా పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో జర్నలిస్టుల ర్యాలీ


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

**భద్రాచలంఅర్బన్:** బీజాపూర్ జిల్లా కేంద్రంలో హత్యకు గురైన ముఖేష్ చంద్రాకర్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఆదివారం రాత్రి భద్రాచలంలో జర్నలిస్ట్ జేఏసీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. భద్రాచలంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి బ్రిడ్జి సెంటర్ వరకు కొనసాగిన ఈ ర్యాలీలో.. అమర్ రహే ముఖేష్ చంద్రాకర్ అమర్ రహే.. జోహార్ ముఖేష్ చంద్రాకర్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ.. అవినీతి అక్రమాలను వెలికి తీస్తున్న జర్నలిస్టులపై దాడులు, హత్యలను నిరోధించడానికి ప్రభుత్వాలు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ముఖేష్‌చంద్రాకర్‌ను హత్య చేసిన కాంట్రాక్టర్ ఆతని అనుచరులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు జేఏసీ నాయకులు బీవీ రమణారెడ్డి, కర్రా అనీల్‌రెడ్డి, మొబగాపు ఆనంద్, శ్రీహరి, ఈశ్వర్, అన్వేష్‌రెడ్డి, తమ్మళ్ల రాజేష్, సుధీర్, ప్రసాద్, రంజిత్ నాయక్ పాల్గొన్నారు.